

మౌలిక వసతులను తెలుసుకుంటున్న వేణుగోపాల్

## పోలింగ్ బూత్‌లను సిద్ధంగా ఉంచాలి

తాడ్వాయి, అక్టోబర్ 25 : మండలంలోని పోలింగ్ బూత్‌లలో ఎలాంటి సమస్యలు లేకుండా సిద్ధంగా ఉంచాలని అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను బుధవారం తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీవో శ్రీధర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆయా పోలింగ్ బూత్‌లలో విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, వికాలాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంప్‌లను పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయనవెంట ఆర్ఐ సాంబయ్య ఉన్నారు.



గుడుంబాతో పట్టుబడిన నిందితుడిని చూపుతున్న ఎస్సై

## గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

వాజేడు, అక్టోబర్ 25 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి అక్రమంగా గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని బుధవారం వాజేడు పోలీసులు అరెస్ట్ చేశారు. వాజేడు ఎస్సై చావాళ్ల వెంకటేశ్వరరావు కథనం ప్రకారం మండలంలోని ఘణపురం గ్రామం వద్ద సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో బైక్‌పై వస్తున్న ఘనపురం గ్రామానికి చెందిన కుమ్మరి గోపిచంద్‌ను తనిఖీ చేయగా రూ. 13,500 విలువైన 45 లీటర్ల గుండుంబా పట్టుబడింది. నిందితుడిని అరెస్ట్ చేసి, గుడుంబాను స్వాధీనం చేసుకొని బైక్ సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

# నాగజ్యోతి గెలుపు కోసం పనిచేయాలి

- సంక్షేమ పథకాలే విజయానికి పునాదిరాళ్లు
- అభివృద్ధిని చూసి ఓటు వేయాలి
- మండల ఎన్నికల ఇన్‌చార్జి సమ్మారావు

వెంకటాపూర్, అక్టోబర్ 25 : ములుగు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మూడు మండలాల ఎన్నికల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావు సూచించారు. మండలంలోని గుర్రంపేటలో బుధవారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి కార్యకర్త గడగడపకూ వెళ్లి పార్టీ మ్యానిఫెస్టో, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అభిప్రాయ భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయ దుందుభి మోగించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని అనుభవించి ప్రజలను మభ్యపెడుతూ దేశాన్ని వెనక్కినెట్టిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక రెప్పపాటు కరెంటు కూడా పోవడం లేదన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని, గ్రామ ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని, ఇది కొనసాగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సాంబారి సమ్మారావు కోరారు. సమావేశంలో మండల సమన్వయ కమిటీ సభ్యుడు గై అశోక్, ప్రసాద్‌రెడ్డి, నడిగొట్టు సుదర్శన్, ఉమ్మడి సాంబ య్య, మండల శ్రీధర్‌రెడ్డి, భాషవేణి జ్ఞానేందర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాంబారి సమ్మారావు

## విధులకు గైర్హాజరైతే చర్యలు

ములుగు రూరల్, అక్టోబర్ 25 : వైద్యులు, సిబ్బంది విధులకు గైర్హాజరైతే శాఖా పరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య హెచ్చరించారు. బుధవారం మండలంలోని రాయినిగూడెం పీహెచ్‌సీని ఆయన డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌తో కలిసి సందర్శించారు. విధులకు గైర్హాజరైన ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్‌కు మెమో జారీ చేశారు. అక్కడి నుంచి సర్వాపురం, కొత్తూరు, జంగాలపల్లి, ఇంచర్ల, పత్తిపల్లి గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా చోట్ల చిన్నారులకు ఇస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కొత్తూరు, ఇంచర్ల ఏఎన్ఎంలకు మెమో జారీ చేయాలని వైద్యాధికారిణిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ, ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు సక్రమంగా హాజరు కావాలని, రోగులకు సేవలందించాలని ఆదేశించారు. ఆశ కార్యకర్తలు సైతం తమ పరిధిలో ఉన్న చిన్నారుల లిస్టును తయారు చేసి ఏఎన్ఎంలకు అందించాలని సూచించారు. ఆయన వెంట ఏఎన్ఎం తిరుపతమ్మ, ఆశ కార్యకర్తలు తదితరులున్నారు.



రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య



చర్ల : పూజిత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న వెంకట్రావు

## భారీ మెజార్టీతో గెలిపించాలి

**భద్రాచలం బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రావు**

దుమ్ముగూడెం/చర్ల, అక్టోబర్ 25 : వచ్చే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు కోరారు. బుధవారం ఆయన ఖమ్మం జిల్లా దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో పర్యటించారు. దుమ్ముగూడెం మండలం అడవిరామవరంలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. అలాగే చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెంలో ప్రచారంలో పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు కలిదిండి రామచంద్రరావును కలుసుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు ఆకుల శ్రీను ఇంటికెళ్లి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన కుమార్తె పూజిత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ మండల నాయకులతో ఎన్నికల వ్యూహంపై చర్చించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు అన్నె సత్యనారాయణమూర్తి, సోయం రాజారావు, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, కార్యదర్శులు కణితి రాముడు, పోలిన లంకరాజు, ఎంపీపీ గీద కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం : దుర్గామాత శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



గోవిందరావుపేట : కోలాటం ఆడుతున్న మహిళలు

# ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

- కనుల పండువగా దుర్గామాత శోభాయాత్ర
- నృత్యాలు, కోలాటాలతో ఘనంగా నిమజ్జనం

ఏటూరునాగారం, అక్టోబర్ 25 : తొమ్మిది రోజులపాటు కొనసాగిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం నిమజ్జనంతో ముగిశాయి. మండల కేంద్రంలో ఆలయాలు, మండపాల వద్ద కొలువైన దుర్గామాత శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నృత్యాలు, కోలాటాలతో అలరించారు. అనంతరం రాత్రి ముల్లకట్ట బ్రిడ్జి వద్ద విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి గోదావరిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో సుదర్శన్‌శర్మ, ఎల్లా ప్రగడ రాధాకృష్ణ శర్మ, రాజ్‌కుమార్, పున్నెం కిరణ్, వెలకుర్తి లక్ష్మణాచారి, చెల్పూరి రామనాథం, మడిగల నరేశ్, ముక్కెర భిక్షపతి, లాలయ్య, గంజి రమేశ్, ప్రమోద్ కుమార్, ఉట్నూరు రాంబాబు, భరత్ రెడ్డి, సాయి, అన్వేష్, సుమన్, అలువాల శ్రీనివాస్, మోడెం రమేశ్, మెరుగు సత్యం, బచ్చు సతీశ్, పోగుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### మంగపేటలో..

మంగపేట : మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ముందుగా మండపాల వద్ద కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారి వస్త్రాల వేలం పాటలు జరిపారు. అనంతరం డప్పుచప్పుళ్లతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారుల కోలాటాలు ఆకట్టుకున్నాయి. భక్తులు శోభాయత్రగా వస్తున్న అమ్మవారికి నీళ్లారబోస్తూ, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈవేడుకల్లో ఆయా గ్రామాల భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

### గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న దుర్గామాతను మంగళవారం రాత్రి ఘనంగా నిమజ్జనం చేశారు. గోవిందరావుపేటలోని విగ్రహాన్ని రంగాపూర్ ప్రాజెక్ట్‌లో, చల్వాయిలోని విగ్రహాన్ని గౌరారం చెరువులో, పస్రాలోని విగ్రహాన్ని ఏటూరునాగారం సమీపంలోని గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో యువకుల నృత్యాలు, మహిళల కోలాటాల నడుమ నిమజ్జనం చేశారు. సీఐ శంకర్, ఎస్సై మస్తాన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మంగపేట : నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

## రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్, అక్టోబర్ 25 : మండలంలోని రామప్ప దేవాలయం దసరా సెలవుల సందర్భంగా బుధవారం పర్యాటకులు, భక్తులతో సందడిగా మారింది. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. అనంతరం రామప్ప సరస్సులో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

### 28న ఆలయం మూసివేత

ఈనెల 28వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత చంద్రగ్రహణం నేపథ్యంలో రామప్ప దేవాలయాన్ని మూసివేయనున్నట్లు ఈవో బిల్లా శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని, అనంతరం గర్భగుడిని మూసివేసి తిరిగి 29న ఉదయం 6 గంటలకు ఆలయ ద్వారం తెరిచి సంప్రోక్షణ, అభిషేకం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఈవో తెలిపారు.